అదానీపై ఐక్య పోరు

- అంబుజా ఫ్యాక్టరీ రద్దయ్యే వరకూ ఉద్యమం
- అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ
- వాస్తవ నివేదికే ఇవ్వాలని అఖిలపక్షం డిమాండ్

మార్చి నెలలోనే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు నివేదిక తయారు చేసిన ప్రతులను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఫ్యాక్టరీ ప్రతి పాదిత స్థలం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రామన్నపేట జనం ఐక్య రణానికి సిద్ధమన్నది. పోరుబాటలో బీఆర్ఎస్ పార్టీ ముందుండగా, సీపీఎం, సీపీఐ ఐక్యపోరాటాలకు సిద్ధమేనని స్పష్టంచేశాయి. ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు భాగమవుతాయని ముందుకొచ్చాయి.అఖిలపక్ష కమిటీలు, పర్యావరణ పరిరక్షణ వేదికగా అవిశ్రాంత పోరాటాలకు ఈ ప్రాంత ప్రజలు రణనినాదం చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమైన వ్యతిరేకతనే ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేస్తూ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌కు కదిలివచ్చారు.ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైన అభిప్రాయాలను ఉన్నది ఉన్నట్టుగా ప్రభుత్వానికి నివేదించాలని గురువారం యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంతు కే జెండగేని కలిసి అఖిలపక్షం, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

'అదానీ గోబ్యాక్'.. అదొక్కటే ఎజెండా

అఖిలపక్షం, పర్యావరణ పరిరక్షణ వేదికల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల జెండాలకు తావులేకుండా ఒక్కతాటిపై 'అదానీ గోబ్యాక్' అన్న ఒక్కటే ఎజెండాగా ముందుకు సాగుతున్నారు. అదానీ కంపెనీ ప్రతినిధులు వీరి ఐక్యతకు విఘాతం కలిగించేలా కుట్రలు చేసినా వీరి పోరాట పటిమ ముందు ఫలించలేదు.

అదానీ కంపెనీపై పోరాటం

రామన్నపేట ఉనికిని ప్రశ్నార్థకం చేసే అదానీ సిమెంట్ కంపెనీపై రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం, సీపీఐ నేతలు జిల్లెల పెంటయ్య,ఊట్కూరి నర్సింహ స్పష్టంచేశారు. గురువారం రామన్నపేటలో వారు మీడియాతో మాట్లాడారు. అదానీ సిమెంట్ కంపెనీ ఏర్పాటు విషయం వెలుగులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు క్షేత్రస్థాయిలో నికరమైన పోరాటం సాగిస్తున్నట్టు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత 40 రోజులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో దశలవారీగా సాగుతున్న పోరాటంలో సీపీఎం, సీపీఐ, వామపక్ష ప్రజాసంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. అదానీ తన కంపెనీని రద్దు చేసుకునే వరకు పోరాటం ఆగదని తేల్చిచెప్పారు.

నూరుశాతం వ్యతిరేకిస్తాం: సీపీఎం నేత ఎండీ జహంగీర్

రామన్నపేటలో అదానీ కంపెనీ ఏర్పాటును తమ పార్టీ నూటికి నూరుశాతం వ్యతిరేకిస్తుందని సీపీఎం నేత ఎండీ జహంగీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రజలతో కలిసి తమ పార్టీ పోరుబాటలో ముందున్నదని పేర్కొన్నారు. అదానీ కంపెనీ ఏర్పాటు నిర్ణయం రద్దయ్యే వరకు సాగే పోరులో కమ్యూనిస్టులుగా తామూ ముందుంటామని ఎండీ జహంగీర్ తెలిపారు.

సీఎం గారూ.. అనుమతులివ్వొద్దు: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

రామన్నపేట, అక్టోబర్ 24: రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి అనుమతులు ఇవ్వకుండా చిత్తశుద్ధిని చాటుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హితవు పలికారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును నిలిపివేయించాలని కోరారు. ఈ విధంగా వారు ప్రజలకు మేలు చేస్తే పరిసర గ్రామాల్లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున అభ్యర్థులను పోటీలో నిలబెట్టబోమని చిరుమర్తి ప్రకటించారు.

'గ్రూప్స్'లో వర్గీకరణను అమలుచేయాలి

- అప్పటివరకు గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలి
- గ్రూప్- 1, 2, 3 అభ్యర్థులకు న్యాయం చేయాలి
- జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఎస్సీ నిరుద్యోగుల లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే వరకు గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలని ఎస్సీ సామాజికవర్గాల నిరుద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గురువారం జాతీయ ఎస్సీ కమిషన్‌కు లేఖ రాశారు. త్వరలో జరగబోయే గ్రూప్-3లో 1,380పైచిలుకు పోస్టులు, గ్రూప్-2లో 783 పోస్టుల పరీక్షలను ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు వాయిదా వేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణను తక్షణమే అమలు చేస్తామని, గ్రూప్స్ పోస్టుల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. దీంతో పరీక్షలను వాయిదా వేసి ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం భవిష్యత్‌లో ఇంత పెద్దమొత్తంలో ఉద్యోగాల భర్తీ చేపట్టే అవకాశం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే గ్రూప్-2ను నాలుగుసార్లు వాయిదా వేసినందున ఇతర వర్గాల అభ్యర్థులు వ్యతిరేకించే అవకాశం ఉందని తెలిపారు. అవసరమైతే ఈ నోటిఫికేషన్లలోనే అదనపు పోస్టులు కలిపి తిరిగి నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఇటీవల భర్తీ చేసిన ఏఈఈ, ఏఈ, డీఏస్సీలో వర్గీకరణ అమలు చేయలేనందునా, కనీసం గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగ నియామకాల్లోనైనా న్యాయం చేయాలని విన్నవించారు. జాతీయ కమిషన్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ వెంకట్‌కు లేఖలు రాశామని ఎస్సీ విద్యార్థులు వెల్లడించారు.

గ్రూప్-1కు 67.7% హాజరు

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్‌లో భాగంగా గురువారం జరిగిన ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్ పేపర్-3 పరీక్షకు 67.7 శాతం అభ్యర్థులు హాజరయ్యారని టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటు చేసిన 46 సెంటర్లలో 31,383 మందికి గానూ 21,264 మంది పరీక్ష రాశారని వెల్లడించారు.

- సోయా కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో తేమ పేరిట సోయా పంటను కొనుగోలు చేయడం లేదంటూ గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలుపుతూ అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాధిక మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. – బేల

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి అక్రమ అరెస్ట్

- మధిర రూరల్ ఠాణా ఎదుట జడ్పీ మాజీ చైర్మన్ నిరసన
- పుల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

మధిర/చింతకాని/ఖమ్మం/ఖమ్మం లీగల్, అక్టోబర్ 24: ఖమ్మం జిల్లా చింతకాని మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. మఫ్టీలో ఉన్న వైరా సర్కిల్ పోలీసులు ఐదు కార్లలో వచ్చి అయ్యప్ప మాల ధరించిన పుల్లయ్యను చింతకాని మండలం ప్రొద్దుటూరులోని ఆయన ఇంట్లో నుంచి బలవంతంగా లాక్కొచ్చి వాహనంలో ఎక్కించారు. కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో పుల్లయ్య ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు..పార్టీ నాయకులతో కలిసి అక్రమ అరెస్టును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కమల్‌రాజు వెంట మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి ఉన్నారు. పుల్లయ్య భార్య పెంట్యాల భారతమ్మ ఒక్కసారిగా కుప్పకూల డంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. పుల్లయ్య అక్రమ అరెస్టును ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

పుల్లయ్యకు 14 రోజుల రిమాండ్

ఖమ్మం జిల్లా చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఖమ్మం మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన గూని ప్రసాద్ విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల షాక్ తగిలి మృతిచెందాడు. దీంతో అతడి మృతదేహంతో కొదుమూరు విద్యుత్తు సబ్ స్టేషన్‌కు బయలుదేరగా..వెంటవెళ్తున్న నరేశ్, పెంట్యాల పుల్లయ్య తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. విధులకు ఆటంకం కలిగించి చంపడానికి యత్నించారని నరేశ్, పెంట్యాల పుల్లయ్యతోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అరెస్ట్ చేసి ఖమ్మం మూడవ అదనపు కోర్టుకు తరలించగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

సీఐ లైంగిక వేధింపుల కేసు విచారణ

కాజీపేట, అక్టోబర్ 24: మల్టీ జోన్ (వీఆర్)లో ఉన్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌పై నమోదైన పోక్సో కేసును డీసీపీ విచారణ చేపట్టారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సీఐ కుటుంబం ఉంటుంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆయన కూతురు స్నేహితురాలిని ఈనెల 9న సీఐ లైంగిక వేధింపులకు గురిచేసినట్టు బాధితురాలు తల్లిదండ్రులు మంగళవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐపై పోక్సో కేసు నమోదుకాగా.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాను విచారణకు ఆదేశించారు. డీసీపీ గురువారం సదరు అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. సీఐతోపాటు బాలిక కుటుంబ సభ్యులను విచారించారు.

చిట్‌ఫండ్‌పై జీఎస్టీ తగ్గించాలి

తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ చిట్‌ఫండ్స్ నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): చిట్‌ఫండ్ సంస్థల రుసుములు, ఆదాయంపై ఉన్న 18శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ చిట్‌ఫండ్స్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లును గురువారం ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.డిప్యూటీ సీఎం ను కలిసినవారిలో ఫెడరేషన్ చైర్మన్ రాజాజీ, ప్రెసిడెంట్ కే శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ ఎల్ సుమన్, కోశాధికారి ఆర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

'దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం'

హైదరాబాద్, అక్టోబర్24 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా, బోర్డు మీటింగ్‌లో పలు కీలక తీర్మానాలు చేశామని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వెల్లడించారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్‌లో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ అధ్యక్షతన అత్యున్నత స్థాయి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో కార్పొరేషన్ జేఎండీ శైలజ, జీఎం ప్రభంజన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

టీ-స్క్వేర్ డిజైన్ల పరిశీలన

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ):హైదరాబాద్ రాయదుర్గం కూడలిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న టీ-స్క్వేర్ నిర్మాణ డిజైన్లను ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయంలో పరిశీలించారు. ఇప్పటికే టెండర్ ప్రకటన విడుదల కాగా పలు సంస్థలు తమ డిజైన్లను మంత్రి ఎదుట ఉంచాయి. స్పందించిన శ్రీధర్‌బాబు న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ తరహాలో 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా టీ-స్క్వేర్‌ను రూపొందించాలని సూచించారు.

సైబర్ సెక్యూరిటీ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో హ్యాక్-2.0 పేరుతో నవంబర్ 6న నిర్వహిస్తున్న వార్షిక సైబర్ సెక్యూరిటీ, అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనాలని మంత్రి శ్రీధర్‌బాబును నిర్వాహకులు ఆహ్వానించారు.

ఎస్‌ఎల్‌బీసీ పనులు ప్రారంభించాలి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్24 (నమస్తే తెలంగాణ): ఎస్‌ఎల్‌బీసీ(శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) టన్నెల్ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని ఏజెన్సీ ప్రతినిధులను సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో రాబిన్స్ కంపెనీ సీఈవో లాక్ హోమ్, సైట్ మేనేజర్ గ్లెన్‌తో గురువారం సమీక్షించారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ రెండువైపులా బోరింగ్ మెషినరీ పొజిషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండువైపుల నుంచి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి, డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

ఫోన్ ట్యాపింగ్‌లో సుప్రీంకు తిరుపతన్న

న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ మేకల తిరుపతన్న బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మోహిత్‌రావు వాదనలు వినిపించా రు. అనంతరం ధర్మాసనం జోక్యం చేసుకొంటూ.. ప్రభుత్వ వాదనలు కూడా వినాల్సి ఉందని పేర్కొంటూ.. నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది.

ఏపీ సీఎం నివాసం వద్ద కొండచిలువ కలకలం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద కొండచిలువ కలకలం రేపింది. ఏదో జంతువును మింగిన కొండచిలువను సీఎం ఇంటి సమీపాన ఉన్న మీడియా పాయింట్ వద్ద గుర్తించారు. దీనిపై మీడియా ప్రతినిధులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి వచ్చిన సీఎం భద్రతా సిబ్బంది మునిసిపాలిటీ వారికి సమాచారం ఇచ్చారు. వారు చనిపోయిన కొండచిలువను అక్కడి నుంచి తొలగించే ఏర్పాటు చేశారు.

రైతును బలిగొన్న రుణమాఫీ చిక్కు

మొదటిపేజీ తరువాయి...

ఉన్న రైతు మహేందర్‌రెడ్డి గ్రామంలో ఎవరు కలిసినా తనకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందేవాడు. ఈ ఏడాది వ్యవసాయం కూడా కలిసిరాలేదు. తనకున్న 4 ఎకరాల్లో వేసిన వరి పంట ఇటీవల కురిసిన వర్షంతో దెబ్బ తిన్నది. ఇటు రుణమాఫీ కాక, అటు ఎవుసం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అనే బెంగతో గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కొమురవెల్లి ఎస్సై రాజుగౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

జెరంటుట్ ఆయిల్ పామ్ క్షేత్రంలో తుమ్మల

మలేషియాలో పర్యటన

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మలేషియా పర్యటన కొనసాగుతున్నది. గురువారం రెండోరోజూ పహాంగ్ రాష్ట్రం జెరంటుట్‌లో ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్, ఆర్ అండ్ డీ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడి అధికారులతో మాట్లాడి ఆయిల్‌పామ్ సాగు విధానం, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు. అలాగే కుయంటన్ పోర్ట్‌లో పామాయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను సందర్శించారు. ఆయన వెంట రాష్ట్ర హార్టికల్చర్ అధికారులు ఉన్నారు.

జానీ మాస్టర్‌కు బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): లైంగిక వేధింపుల కేసులో రిమాండ్‌లో ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. జానీ మాస్టర్, అతని కుటుంబసభ్యులు ఎవరూ ఫిర్యాదుదారురాలి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలోకి వెళ్లకూడదు, ఆమెను వ్యక్తంగా కలవకూడదని షరతు విధించింది. రూ.20 వేల వ్యక్తిగత బాండ్లు, అదే మొత్తానికి మరో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. లైంగిక వేధింపులపై ఓ మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు మేరకు జానీ మాస్టర్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఆయనపై పోక్సో కింద కేసు నమోదు చేశారు.

సంచుల్లేవు.. కాంటాల్లేవు!

మొదటిపేజీ తరువాయి...

పిలిచింది. ఈ టెండరు ప్రక్రియ నవంబర్‌లో పూర్తి కానుంది. అతి ముఖ్యమైన గోనె సంచులకు సివిల్ సప్లై సంస్థ 5న టెండర్లు పిలిచింది. 7 కోట్ల పాత గన్నీ సంచులకు టెండర్లు కోరింది. ఇప్పటి వరకు ఈ టెండరు ప్రక్రియ పూర్తి కాలేదు. వచ్చే నెలలోనే పూర్తయ్యే అవకాశాలున్నాయని పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి. ధాన్యం కొనుగోలుకు అవసరమైన వస్తువుల కొనుగోలు ప్రక్రియ వచ్చే నెల వరకు జరిగితే.. సదరు సంస్థలు ఆ వస్తువులను సరఫరా చేసేదెప్పుడు? అవి కొనుగోలు కేంద్రాలకు చేరేదెప్పుడు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ అయ్యే సరికి కొనుగోళ్లు కూడా పూర్తవుతాయని పేర్కొంటున్నారు.

గన్నీ సంచుల్లేవు

ఈ సీజన్‌లో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం ధాన్యం నింపేందుకు సుమారు 22 కోట్ల గన్నీ సంచులు అవసరం అవుతాయని అంచనా. అయితే ఇందులో 7 కోట్ల పాత గన్నీ

సంచులు అవసరం కాగా మిగిలినవి కొత్తవి కావాలి. పాత గన్నీ సంచుల కోసం ఇటీవల టెండర్లు పిలిచారు. ఇవి వచ్చే నెలాఖరుకుగానీ వచ్చే పరిస్థితి లేదు. కొత్త గన్నీ బ్యాగులను కొన్ని కొనుగోలు చేసినట్టుగా తెలిసింది. మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జోరందుకోనున్న నేపథ్యంలో గన్నీ సంచుల సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్లతో ఒప్పందం లేదు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన ఉండడం లేదు. ఓవైపు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికారులు, మంత్రి చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు పూర్తి స్థాయిలో పాలసీనే విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ఇక కొనుగోలు చేసిన ధాన్యాన్ని దించుకునేందుకు మిల్లర్లతో సివిల్ సప్లై ఒప్పందం చేసుకోవాలి. కానీ ఇప్పటివరకు ఒప్పందం జరగలేదు. యంత్ర పరికరాలు, సంచులు, టార్పాలిన్ల పరిస్థితి తెలిసిందే. ఎలాంటి ఏర్పాట్లు చేయకుండానే ప్రభుత్వం కొనుగోళ్లపై హడావిడి ప్రకటనలు చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 7248 కేంద్రాలను ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటివరకు 2539 కేంద్రాలను మాత్రమే ప్రారంభించినట్టు స్వయంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అక్టోబర్ 1 నుంచే కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టుగా చెప్పిన ప్రభుత్వం.. గడిచిన 20 రోజుల్లో కొనుగోలు చేసిన ధాన్యం 1500 టన్నులు మాత్రమే కావడం గమనార్హం.

పైసలు పిండండి.. రాబడి పెంచండి!

మొదటిపేజీ తరువాయి...

పెంచవచ్చో ప్రతిఒక్కరూ ఒకటి రెండు రోజుల్లో ప్రణాళికలు సమర్పించాలని స్పష్టంచేసినట్టు సమాచారం. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా వేటి ధరలు పెంచవచ్చో చెప్పాలని సీఎం ఆదేశించారట. రాష్ట్రం నడవాలంటే నెలకు సుమారు రూ.10 వేల కోట్ల నుంచి 12 వేల కోట్లు అవసరమని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి, సబ్సిడీ సిలిండర్లు వంటి పథకాల భారం పెరిగిందని, మరోవైపు ఆదాయం పడిపోయిందని ఆ వర్గాలే చెప్తున్నాయి.

తగ్గిన ఆరు శాతం రాబడి

నిరుడితో పోలిస్తే రాష్ట్ర ఆదాయం పడిపోయిందని ఉన్నతాధికారులు సీఎంకు లెక్కలతో సహా వివరించారు. కాగ్‌కు ప్రభుత్వం సమర్పించిన సెప్టెంబర్ నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.75,454 కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. రాబడి అంచనాలో ఇది 34 శాతం మాత్రమే. ఇదే సమయానికి నిరుడు రూ.87,207 కోట్లు ఖజానాకు చేరాయి. అంటే ఈ ఏడాది రూ.11,753 కోట్లు రాబడి తగ్గిందని ఆర్థికశాఖ వర్గాలు వివరించినట్టు సమాచారం.

పథకాల అమలుకు పరేషాన్

మరోవైపు గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల సంఖ్య, ఆర్టీసీలో మహిళల ప్రయాణ రాయితీలు పెరుగుతున్నాయి. దసరా పండుగకు ఉచిత ప్రయాణం డబుల్ అయ్యింది. వీటికి తోడు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పథకానికి నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. వడ్లకు బోనస్ ఇచ్చే గడువు తరుముకొస్తున్నది. రుణమాఫీ ఇంకా పూర్తిచేయాల్సి ఉన్నది. ఇప్పుడున్న ఈ పరిస్థితుల్లో ఇవన్నీ సాధ్యం కాదని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు తేల్చి చెప్పారని సచివాలయ వర్గాల సమాచారం. వీటికి తోడు అధికార పార్టీ హామీలన్నీ అమలు చేయాల్సి వస్తే నెలకు కనీసం రూ.8 వేల కోట్ల నుంచి 10 వేల కోట్లు అదనంగా కావాలని తేల్చి చెప్పారట. అప్పులు తెద్దామన్నా ఇప్పటికే చేసిన రుణాలతో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి ముంచుకొస్తున్నదని, ఆశించిన మేర అప్పు పుట్టకపోవచ్చని చెప్పినట్టు తెలిసింది. గరిష్ఠంగా నెలకు నాలుగైదు వేల కోట్ల వరకు రావొచ్చని, అయినా కనీసం నెలకు నాలుగైదువేల కోట్లు లోటు ఉంటుందని వివరించారట. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ప్రత్యేకంగా హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారని చెప్తున్నారు.

ఆదాయం ఎందుకు రావడం లేదబ్బా!

ఒక్క ఎక్సైజ్ మినహా మిగతా విభాగాల నుంచి ఆశించిన ఆదాయం ఎందుకు రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. ఓ వైపు రాబడి పడిపోతున్నదని, మరోవైపు సంక్షేమ పథకాలకు ఖర్చు పెరుగుతున్నదని, దీనిని ఎలా అధిగమించాలో చెప్పాలని అధికారులనే సీఎం సలహాలు అడిగినట్టు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో రాబడి పెరగాల్సిందేనని స్పష్టం చేయడంతో, పన్నులు పెంచడం తప్ప మరో మార్గం లేదని ఆ హెచ్‌వోడీలు తేల్చిచెప్పినట్టు సమాచారం. దీంతో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఏయే విభాగాల్లో పన్నులు పెంచవచ్చో ప్రతిపాదనలు రూపొందించాలని ఆ అధికారులను సీఎం ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ శాఖల్లో సోషల్ మీడియా కనుమరుగు!

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాకు ప్రభుత్వ ప్రధాన శాఖలు దూరంగా ఉంటున్నాయి. హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఉండే కీలక విభాగాలు హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ ఎక్స్, ఫేస్‌బుక్ వైపు కన్నెత్తి చూడటం లేదు. హెచ్‌ఎండీఏకు వచ్చే అభ్యర్థనలలో ఎక్కువగా ప్రజా మౌలిక అవసరాలకు సంబంధించినవే ఉంటాయి. లింకు రోడ్లు, సర్వీస్ రోడ్లు, ప్లానింగ్ విభాగంలో తలెత్తే సమస్యలు, ఓపెన్ ప్లాట్లు, లే అవుట్లు, ఓఆర్ఆర్‌పై వానాదారుల సమస్యలపై ప్రజలు ఎక్స్, ఫేస్‌బుక్‌లో తమ సమస్యలను ప్రస్తావిస్తుంటారు. అంతేగాక ప్రభుత్వపరంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఈ వేదికల ద్వారా తెలుసుకోవడం ప్రజలకు సులభంగా ఉంటుంది. ఈ విధానమంతా గత ప్రభుత్వ హయాంలో అందుబాటులో ఉండేది. నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమాల వినియోగాన్ని ప్రోత్సహించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రమక్రమంగా ఎక్స్, ఫేస్‌బుక్ వినియోగం తగ్గిపోతున్నది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ తప్పిదాలు బయటపడుతాయన్న భయంతోనే వీటి వినియోగానికి దూరంగా ఉంటున్నట్టు తెలుస్తున్నది. ఓ సీనియర్ అధికారి ఎంఏయూడీ విభాగం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎక్స్, ఫేస్‌బుక్ వినియోగం మరింత తగ్గినట్టు సమాచారం.

సింగరేణి బోనస్ రూ. 93,750

రూ. 358 కోట్ల విడుదలకు భట్టి ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులకు ప్రభుత్వం రూ. 358 కోట్ల దీపావళి బోనస్ ప్రకటించింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు కార్మికుల ఖాతాల్లో బోనస్ అమౌంట్ జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ బలరామ్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సచివాలయంలో సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బోనస్ వివరాలను మీడియాకు వెల్లడించారు. 42 వేల మందికి రూ. 93,750 చొప్పున చెల్లించనున్నారు. దీపావళి బోనస్ 350 కోట్లను విడుదల చేయాలని పర్సనల్, ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించామని సీఎండీ వెల్లడించారు. కోల్ ఇండియాతో జరిగిన చర్చల్లో ఈ ఏడాది కార్మికులకు లక్ష బోనస్ ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రూ. 375 కోట్లు అవసరమని చెప్పాయి. లక్ష దీపావళి బోనస్ ఇప్పిస్తామని కార్మిక సంఘాలు హామీ ఇచ్చాయి. కానీ ఆ హామీ నెరవేరకపోవడంతో కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వర్ధన్నపేట కాంగ్రెస్‌లో విభేదాలు

- పట్టింపేలేనప్పుడు పార్టీలో ఎందుకుండాలని తిరుగుబాటు
- మౌనమే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సమాధానం

రాయపర్తి (వర్ధన్నపేట), అక్టోబర్ 24: వర్ధన్నపేట నియోజకవర్గంలో అధికార పార్టీలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సాక్షిగా విభేదాలు భగ్గుమన్నాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తున్న సందర్భంలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు దొమ్మాటి మల్లయ్య, మక్బూద్, శివరాత్రి తిరుపతి, మంజూరు అహ్మద్, సమ్మెట రాంబాబుతో పాటు 100 మంది కార్యకర్తలు ఇందిరమ్మ గ్రామ కమిటీల్లో తమకు అన్యాయం జరుగుతున్నదని వాదించారు. కష్టించి పనిచేసిన తమను కాదని గ్రామాల్లో వలస నేతలు చక్రం తిప్పుతున్నారని మండిపడ్డారు. గుర్తింపే లేనప్పుడు పార్టీ కోసం ఎందుకు పని చేయాలని ప్రశ్నించారు. దీంతో పార్టీ శ్రేణులకు సమాధానం చెప్పకుండానే ఎమ్మెల్యే మౌనంగా కారెక్కి వెళ్లిపోవడం గమనార్హం. కాగా ఆందోళనకారులను ఎస్సైలు భూక్యా చందర్‌నాయక్, మెరుగు రాజు పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమిటీ

- సమస్యలు తీర్చేందుకు సిద్ధం
- డీఏలపై నేటి సాయంత్రం స్పష్టత
- ఉద్యోగ సంఘాలతో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్‌గా, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా కే కేశవరావు ఉంటారని ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలపై గురువారం కమాండ్ కంట్రోల్‌లో సంఘాల నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. డీఏల అంశంపై శుక్రవారం సాయంత్రంలోగా నిర్ణయం ప్రకటిస్తామని సీఎం హామీ ఇచ్చారు. 317 జీవోపై ఇప్పటికే సబ్ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎస్ శాంతికుమారి, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే: స్థిత ప్రజ్ఞ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందేనని టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ ప్రభుత్వాన్ని కోరారు.

డీఏల కోసమే సబ్ కమిటీనా?: కమలాకర్

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచడం లేదని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్ పేర్కొన్నారు. డీఏల కోసమే కమిటీ వేయడాన్ని ఎన్నడూ చూడలేదని తెలిపారు. కాలయాపన కోసమే క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఫసీయుద్దీన్ ఒక ప్రకటనలో ఆరోపించారు.